క్లుప్తంగా

గ్రూప్-1 అభ్యర్థుల నిరసన



ములుగు: గ్రూప్-1 పరీక్షలు రాసిన అభ్యర్థులకు ఫలితాలలో అన్యాయం జరిగిందని, మెయిన్స్ రీవాల్యుయేషన్‌కు అవకాశం కల్పించాలని కోరుతూ అభ్యర్థులు సోమవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఎదుట నిరసన తెలిపారు. కేవలం రీకౌంటింగ్ అవకాశం మాత్రమే ఇచ్చారని ఈ అవకాశంతో ఎలాంటి లాభం లేదన్నారు. ప్రధానంగా తెలంగాణ మూవ్‌మెంట్ పేపర్‌ను తెలుగులో రాసిన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇంగ్లిష్‌లో రాసిన అభ్యర్థులు 60శాతం మార్కులు సాధిస్తే తెలుగులో రాసిన వారికి 30శాతం మార్కులు కూడా రాలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు పత్తిరి శ్రీధర్, మద్ది మహేందర్, సంతోష్, రమేష్, మహేష్, లక్ష్మణ్, అజ్మత్ షేక్, సుధీర్ పాల్గొన్నారు.

'ఏక్‌భారత్' వేడుకలు



ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంఈఓ మల్లయ్య హాజరై మాట్లాడుతూ.. హరియాణా భాష, వేషాధారణ, ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించడం జరిగిందన్నారు. దేశం విభిన్న సంస్కృతుల సమ్మేళనం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ, కోడి వెంకట్, జయలక్ష్మి, రమాదేవి, రాంబాబు, దేవా, నర్సయ్య, నటరాజ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

గోవిందరావుపేట: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండలంలోని చల్వాయి గ్రామంలోని శ్రీ రాయలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ ప్రారంభించి మాట్లాడారు. ఆలయ పరిసర ప్రాంతాలలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా ఎవరైనా అగుపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి గోవర్ధనగిరి కిరణాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ వీరమాచినేని వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పైడాకుల కృష్ణమూర్తి, కాసర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలోని గుడిగుట్టల సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి హైదరాబాద్‌కు ఇసుక లారీలు వరుసగా వెళ్తున్నాయి. కాగా రామచంద్రాపురం గ్రామ సమీపంలోని గుడి గుట్టల సమీపంలోని రోడ్డుపై ఉన్న గుంతను తప్పించేందుకు లారీని డ్రైవర్ స్లో చేసి గుంతను తప్పిస్తుండగా వెనుక వస్తున్న లారీ డ్రైవర్ సతీష్ వేగాన్ని అదుపు చేయలేక ముందు ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలైయ్యాయి. గమనించిన గ్రామస్తులు 108కు సమాచారం ఇచ్చి వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. కాగా, గాయాలైన లారీ డ్రైవర్‌ది నల్లగొండ జిల్లా కట్టంగూడ మండలం పరిడి గ్రామమని తెలిపారు.

ఒకరి మృతి

వెంకటాపురం(ఎం): మండలంలోని నల్లగుంట శివారులో సోమవారం రాత్రి 10గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ములుగు మండలం పత్తిపల్లి గ్రామానికి చెందిన చెన్నంశెట్టి రమేశ్ (45) అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై జక్కుల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తిపల్లికి చెందిన రమేశ్ భూపాలపల్లి నుంచి ములుగుకు ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో నల్లగుంట వద్ద అదుపుతప్పి కిందపడగా తలకు బలమైన గాయాలై మృతిచెందినట్లు వెల్లడించారు. రమేశ్‌కు జిల్లా కేంద్రంలో కంగన్‌హాల్ దుకాణం ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

ఎస్ఎస్‌తాడ్వాయి: ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కాటాపూర్ గ్రామంలోని బెస్తగుంపులో సోమవారం చేటుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. కాటాపూర్‌లోని బెస్తగుంపునకు చెందిన మునిగాల ఈశ్వరి(32) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈవిషయంపై తాడ్వాయి పోలీసులను సంప్రందించగా మహిళ ఆత్మహత్య గురించి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

ప్రజా పంపిణీపై పట్టింపేది?

- అధికారుల పర్యవేక్షణ శూన్యం
- సమయపాలన పాటించని సేల్స్‌మెన్లు, డీలర్లు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



దోమెడలోని జీసీసీ డీఆర్‌సేల్స్ డిపో

మంగపేట: మండలంలోని జీసీసీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న డీఆర్‌సేల్స్ డిపోలు, రేషన్ షాపుల నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైంది. మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో జీసీసీ ఏటూరునాగారం ఆధ్వర్యంలో 08 డీఆర్‌సేల్స్ డిపోలు, 09 చౌకధరల దుకాణాలు, మహిళా పొదుపు సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో 42 రేషన్ షాపులు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ నెల 01 నుంచి 15 వరకు లబ్ధిదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేయాల్సి ఉంది. ఉదయం 08 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 03 నుంచి 07 గంటల వరకు షాపులను తెరిచి ఉంచాల్సి ఉండగా. సంబంధిత సివిల్‌సప్లై అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వారిని అడిగే వారే లేక పోవడంతో వారి సొంత పనులకు పరిమితమై వారికి తీరికగా ఉన్న సమయంలో కొద్ది రోజులు మాత్రమే ఇస్తు గడువు అయిపోయిందని సమాధానం చెపుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ కూలీపనులపై ఆధార పడిన నిరుపేదలు రేషన్ బియ్యం కోసం కూలీ పనులు వదులుకుని రేషన్ షాపుల ముందు పడిగాపులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీని కారణంగా తమకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం పంపిణీ అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

నిలిచిపోయిన రేషన్ బియ్యం

మండలంలోని నర్సింహాసాగర్‌లోని జీసీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న డీఆర్‌సేల్స్ డిపో పరిధిలోని సుమారు 100 మందికి పైగా లబ్ధిదారులకు 2023 నుంచి బియ్యం ఇవ్వడం లేదని బాధితులు వాపోతున్నారు. సేల్స్ డిపోకు 2023 నుంచి 36 క్వింటాళ్ల బియ్యం సరఫరా కావడం లేదని సమాచారం. దీంతో డీఆర్‌సేల్స్ డిపో సేల్స్‌మెన్‌ను అడిగితే పైనుంచి స్టాక్ సరిపడ రాలేదని సమాధానం చెపుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. రేషన్ బియ్యం అందక పోవడంతో గ్రామస్తులు విషయాన్ని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. 100 మందికి పైగా ఉన్న లబ్ధిదారులకు బియ్యం అందక రెండేళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం చూస్తుంటే రేషన్ షాపుల్లో ప్రజా పంపిణీపై వారి పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. విషయంపై కలెక్టర్ వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపి తమకు రేషన్ బియ్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



గ్రామంలో సుమారు 100 మందికి ఉచిత బియ్యం అందడం లేదని స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు కూడా సమస్యకు పరిష్కారం చూపలేదు. రెండేళ్ల నుంచి 36 క్వింటాళ్ల బియ్యం రావడం నిలిచి పోయినా సివిల్ సప్లై, జీసీసీ అధికారులు తమకేమి సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

–కాడబోయిన నరేందర్, నర్సింహాసాగర్

పంపిణీ జరిగే విధంగా చూస్తాం..



సేల్స్‌డిపోకు రెండేళ్ల నుంచి 36 క్వింటాళ్ల బియ్యం రావడం లేదనే విషయం తన దృష్టికి రాలేదు. విషయాన్ని ఏటూరునాగారం జీసీసీ మేనేజర్ వాణితో మాట్లాడి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

– జీసీసీ డీఎం ప్రతాపరెడ్డి

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

- వైద్యాధికారి వెంకటేశ్



ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): వేసవికాలంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి వెంకటేశ్ అన్నారు. సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆలుబాక, తిప్పాపురం, బోదాపురం, మరికాల, బీసీ మర్రిగూడెం గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం గ్రామ సమీపంలోని మిర్చి తోటల్లో పనులు చేస్తున్న కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసి వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పవన్, మనోహర్, సత్యనారాయణ, రామలక్ష్మి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ములుగు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్జద్ పాషా డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహాని నకల్ ఆధారంగా బ్యాంకు రుణాలు పొందిన రైతుల రుణాలను మాఫీ చేయాలని అన్నారు. రైతులకు భరోసా డబ్బులను సకాంలో చెల్లించాలని అన్నారు. వర్షాకాలంలో రైతులు సాగు చేసిన సన్నధాన్యానికి బోనస్ చెల్లించాలని అన్నారు. రామప్ప నుంచి లక్నవరం వరకు కాల్వ నిర్మాణానికి ప్రభుత్వం సేకరిస్తున్న భూములకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి నర్సయ్య, జక్కుల ఐలయ్య, సారయ్య, రమేశ్, పాణి, స్వామి, మహేందర్, సాంబయ్య, వెంకటరమణ, వెంకట్రాం, సీపీఐ నాయకులు ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠ



హోమం నిర్వహిస్తున్న భక్తులు

వాజేడు: మండల కేంద్రంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేద మంత్రాల నడుమ సోమవారం నిర్వహించారు. భక్తుల సమక్షంలో ఉదయం ఆరు గంటల నుంచి గణపతి పూజ, కళాహోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం 10.22 గంటలకు కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని ఆలయం మధ్యలో ప్రతిష్ఠించారు. అనంతరం వేద బ్రాహ్మణులు పూజలు చేసి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



డీసీఎం, బియ్యాన్ని సీజ్ చేసిన అధికారులు

ఏటూరునాగారం: డీసీఎంలో తరలిస్తున్న 191 క్వింటాల రేషన్ బియ్యాన్ని ఏటూరునాగారం వద్ద జాతీయ రహదారిపై పట్టుకున్నట్లు సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్ తెలిపారు. ఏటూరునాగారం మండలం జంపన్న వాగు రెండో బ్రిడ్జి వద్ద సోమవారం వేకువజామున సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయ్ అధికారులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. ఓఎస్డీ ప్రభాకర్ మాట్లాడుతూ ఇల్లందు గుండాల మండలం నుంచి కోడిశాల, పస్రా, తాడ్వాయి ఏటూరునాగారం మీదుగా ఛత్తీస్‌గఢ్ తరలిస్తున్నారన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీరంగ సత్యనారాయణ, గుండాలకు చెందిన జంపయ్య కొనుగోలు చేసిన బియ్యాన్ని ఖమ్మం జిల్లాకు చెందిన డ్రైవర్ దమ్మంపాటి వెంకటేశ్వర్లు డీసీఎంలో తరలిస్తున్నారని చెప్పారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా సత్యనారాయణ, జంపయ్యకు చెందిన బియ్యంగా తెలిపారన్నారు. మరో క్లీనర్ పరారీలో ఉన్నాడన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించి వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు. సత్యనారాయణ, జంపయ్య, వెంకటేశ్వర్లతోపాటు క్లీనర్‌పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీ రామ్‌చందర్‌తోపాటు సిబ్బంది ఉన్నారు.

క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- వైద్యాధికారిణి గ్యానస



విక్టరీ సింబల్ చూపిస్తున్న వైద్య సిబ్బంది

వాజేడు: క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రగళ్లపల్లి సబ్ సెంటర్ వైద్యాధికారిణి గ్యానస అన్నారు. మండల పరిధిలోని పేరూరు వైద్యశాల, ప్రగళ్లపల్లి సబ్ సెంటర్‌లో సోమవారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలకు కావాల్సిన తెమడను సేకరించారు. ఈ తెమడను పరీక్షల నిమిత్తం వెంకటాపురం(కె) వైద్యశాలలోని ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా గ్యానస మాట్లాడుతూ.. క్షయ వ్యాధి అనుమానితులను తీసుకువచ్చి పరీక్షలను చెపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్య క్రమాల్లో పేరూరు హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ, వాజేడు హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

వజ్రోత్సవాలను విజయవంతం చేయండి



కమిటీ సభ్యులకు నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

- వజ్రోత్సవాల కన్వీనర్ ఇర్సవడ్ల వెంకన్న

ఏటూరునాగారం: వజ్రోత్సవాలను పూర్వ విద్యార్థులు విజయవంతం చేయాలని వజ్రోత్సవాల కన్వీనర్ ఇర్సవడ్ల వెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 1982–83 బ్యాంచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళన కోసం రూ.1లక్ష కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 3, 4 తేదీల్లో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో వజ్రోత్సవవేడుకలను నిర్వహించుకునేందుకు అన్ని వర్గాలకు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు సహకరించాలన్నారు. హుస్సేన్, చందు, నూక ప్రభాకర్, అశోక్, మల్లారెడ్డి, రఘు, రమేష్, శంకర్, సుధాకర్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



కన్నాయిగూడెం: ఉపాధ్యాయులతో విద్యార్థులు

కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు, తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు దయానందసాగర్, జాతీయ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం కన్వీనర్ పొదెం కృష్ణప్రసాద్, జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు కోటయ్య, మంకిడి రాజశేఖర్, యుగేందర్, ముకల కృష్ణ, లక్ష్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



దుంపెల్లిగూడెం ప్రభుత్వ పాఠశాలలో..

గోవిందరావుపేట: మండల పరిదిలోని దుంపెల్లిగూడెం ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడంతో పాటు కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈఓ, ఎంఈఓ, ఎంపీడీఓలుగా పాఠశాలకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాయప్ప, రవి, జితేందర్, గణేష్, లక్ష్మీనారాయణ, సుప్రజ పాల్గొన్నారు.

ఆశవర్కర్లకు రూ.18 వేల వేతనం చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

ములుగు రూరల్: ఆశ వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని కోరుతూ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలాదేవి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ విజయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్లను పారితోషికం పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చుంచు మంజుల, కవిత, రమాదేవి, రేణుక, సభిత, యశోద, శ్యామలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం సమాచార హక్కు చట్టం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ బహూకరించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లుగౌడ్ మాట్లాడుతూ.. పిల్లలు చక్కగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు పోషయ్య, మండల కమిటీ సభ్యులు బండారు కుమార్‌యాదవ్, రమేష్, సమ్మయ్య, ఉపాధ్యాయులు భాగ్యశ్రీ, వెంకన్న, సురేందర్, కల్యాణి, అనిల్ కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీణ్, పద్మ, లలిత, విజయభాస్కర్, రాజయ్య, శ్రీకళ, చందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

వాజేడు: మండల పరిధిలోని వాజేడు, మండపాక గ్రామాల మధ్యన ఉన్న గుడిసె వాసులైన ఆదివాసీలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఏటూరునాగారం ఐటీడీఏ వరకు చేపట్టిన గుడిసెవాసుల పాద యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. గుడిసెవాసులకు విద్యుత్, తాగు నీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దావూద్, మండల కార్యదర్శి రఘుపతి రావు, దేవయ్య, కృష్ణ బాబు, సంతోష్, ప్రవీణ్, నాగమణి ఉన్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ జీఓ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ములుగు రూరల్: అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రెండు లక్షలు ఇచ్చేలా జీఓను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో బాగంగా 48 గంటల మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ వ్యవస్థను నిర్మూలించేందుకు కేంద్రం పన్నిన కుట్రను తిప్పి కొట్టాలని అన్నారు. అంగన్‌వాడీలకు ప్రతి నెల 1న వేతనం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అన్నారు. సాంబశివ, దావూద్, గఫూర్, మల్లారెడ్డి, రవి, సమ్మక్క, పద్మారెడ్డి ఉన్నారు.

గ్రామ గ్రామాన కంటి వైద్యశిబిరాలు



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జంపన్న

ములుగు: రానున్న రోజుల్లో నియోజవర్గంలో గ్రామ గ్రామాన ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న అన్నారు. జిల్లా కేంద్రంలో జంపన్న ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో శ్రీ సత్య కంటి వైద్య నిపుణులు అఖిల్ 250 మందిని పరీక్షించి మందులను అందజేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 39 మందికి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ సత్య కంటి ఆస్పత్రికి ఆపరేషన్ నిమిత్తం పంపించారు.

PUBLIC NOTICE

Date: 17-03-2025

The General Public are hereby put on the general notice that, my client Sri. Cheerla Raju @ Raja Reddy, S/o. Sri. Chirla Sanjeeva Reddy, Age: 57 yrs, Occu: Business, R/o. Chandana Modern Rice Mill, Garapally, Kataram, Jayashankar - Bhupalpally District, I issue the following notice to the General Public that, he has lost his Original Regd. Sale deed vide document No: 21 of 1991 on 14-02-1991 containing the schedule property which is purchased from the previous owner by name Sri. Gudidevuni Laxmaiah. Therefore, if any one traced out such original registered sale deed, they can handover the said original sale deed and whoever has got any objection over the schedule of the property, they can file their objections with documentary evidence within the period of (7) days from this publication to the under signed, failing which the matter will be proceeded according to law.

SCHEDULE OF THE PROPERTY:

Sy.No. 251 measuring Ac. 01.00, of Pothulavai Village, under revenue Village Garepally, Kataram Mandal, Jayashankar - Bhupalpally District within the following boundaries: **East:** Agriculture land of Sri. Laquaulla Khan, **West:** Government land, **North:** Land of Sri. Jana Narsimhulu, **South:** Land of Sri.G. Narsimhulu.

Sd/- **V. SRINIVAS REDDY**, Advocate
H.No.1-7-1266, Road No.8, Advocates Colony, Hanamkonda. Cell: 7674093249.

అనుమానితులను గోదావరి దాటించొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

పలిమెల: కొత్తవారిని, అనుమానాస్పద వ్యక్తులను గోదావరి దాటించొద్దని ఎస్సై రమేశ్ పడవలు నడిపే వారికి, ప్రజలకు సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా సోమవారం మండలంలోని బూరుగుగూడెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామంలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మావోయిస్టులకు సహకరించిన, ఆశ్రయం కల్పించినా చట్టరీత్యా నేరమన్నారు. అలాగే గుడుంబాకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గుడుంబా అమ్మినా, తయారు చేసినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



వెంకటాపురం(కె): అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌పై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా చైర్మన్ కారణ్ కుమార్ వర్మ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని అన్నారు. పార్టీ భద్రాచలం డివిజన్ ఎస్సీ సెల్ చైర్మన్ రావుల నాని, నాయకులు చిట్టిమల్ల దేవాసహాయం, రమేశ్, పురుషోత్తం, మహేష్, తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944